క్లుప్తంగా

పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య అన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం వేతనాలు పెంచిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ నర్సింలు, కోఆప్షన్ మాజీ సభ్యుడు మొహిజొద్దీన్, నాయకులున్నారు.

వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బుచ్చ నాయక్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థుల కోసం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వాలీవాల్‌పై నెల రోజుల పాటు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ


హకింపేటలో పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం హకింపేట, రామంతాపూర్ శివారులోని అకాల వర్షాలకు దెబ్బతిన్న పొలాలను గురువారం మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈఓ రేవతి, రజిత సర్పంచ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్


నియామక పత్రం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం


సంఘం సభ్యులతో నాయకులు

రామాయంపేట(మెదక్): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని రైల్వే పెన్షనర్ల సంఘం జోనల్ కమిటీ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి యాదగిరి అన్నారు. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో మీర్జాపల్లి స్టేషన్ పరిధిలోని పెన్షనర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు నర్సయ్య, పెంటయ్య, రామచంద్రం, నారాయణ, పోచయ్య, రాములమ్మ, మణెమ్మ, రాములు, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు గురువారం నాటికి 39 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ముదిరాజ్ సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే డివిజన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈసంఘటన మండలంలోని గడిపెద్దాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ శివారులో వ్యవసాయ బోరు బావులకు సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. జోగిపేట నుంచి వచ్చిన ఫైరింజన్ మంటలు ఆర్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మొలకలు వచ్చి.. రంగుమారి


కామారం గ్రామంలో మొలకెత్తిన ధాన్యం

అన్నదాతకు అంతులేని వేదన

చిన్నశంకరంపేట(మెదక్): అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండిస్తే.. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు తీవ్ర నష్టాలను మిగిల్చాయి. పది రోజులుగా నిత్యం వర్షం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో ఇప్పటికి అధికారిక లెక్కల ప్రకారం 340 ఎకరాల్లో వడగండ్ల వర్షంతో పంట నష్టపోయినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వరి కోతలు 45 శాతం పూర్తి కాగా అందులో కేవలం 5 శాతం ధాన్యం మాత్రమే కంటా అయింది. మిగతా ధాన్యం మొత్తం కల్లాల వద్ద ఉంది. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు చందంపేట, కామారం, ధరిపల్లి, సూరారం గ్రామాల్లో ఇప్పటికే ధాన్యం మొలకెత్తి రైతులను కునుకులేకుండా చేస్తుంది. జంగరాయి, చందాపూర్, గవ్వలపల్లి గ్రాల్లో ధాన్యం రంగుమారిందని, అధికారులు తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


జంగరాయిలో రంగుమారిన ధాన్యం

వర్షంతో ధాన్యం మొలకెత్తింది



ఆరబెట్టిన ధాన్యం వర్షం రావడంతో మొలకెత్తింది. నిత్యం వర్షంతో ధాన్యం రాశులు తడిసి ముద్దైతున్నాయి. పది రోజుల కింద ఐదేకరాల ధాన్యం తీసుకొచ్చి రోడ్డుపై ఆరబెట్టా. రోజూ కురిసే వర్షంతో తడిసిపోయి ధాన్యం మొలకెత్తుతున్నాయి. అధికారులు చెప్పే తేమ శాతం వచ్చి ధాన్యం కంటా పెట్టాలంటే ఈసారి అయ్యేలా కన్పిస్తలేదు. అధికారులు షరతులు లేకుండా రైతులకు న్యాయం చేయాలి. – జెగ్గరి కిష్టయ్య, రైతు, కామారం

వైభవంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తిచేయడానికి గాను నిధులు మంజూరు చేశానని, ఇంకా అదనంగా నిధులు మంజూరు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

నర్సాపూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలోవైద్యం అందుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. ఆమె గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను సీఎం కేసీఆర్ కార్పొరేట్ రంగానికి దీటుగా అభివృద్ధి చేసి, నాణ్యమైన వైద్యం ప్రజలకు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. నర్సాపూర్, కొడిపల్లి, కొల్చారం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఆమె చెక్కులు అందజేశారు.


చెక్కులు అందిస్తున్న సునీతారెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను, కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గురువారం తహసీల్దార్ హర్దీప్‌సింగ్‌కు టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సుప్రజ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలతో వరి, మొక్క జొన్న పంటలతో రైతులు భారీగా నష్టపోయారని, అధికారులు సత్వరమే రైతుల వివరాలు సేకరించి, నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పట్నం ప్రమీల, వార్డు మెంబర్లు మల్లేశ్వరి, బాలకృష్ణ, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి

కొల్చారం(నర్సాపూర్): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశంగౌడ్ రైతులకు సూచించారు. గురువారం రంగంపేట పరిధిలోని పైతర, కిష్టాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంతోష, గోదావరి, భాను ప్రకాష్‌రెడ్డి, ఎల్లేశం, సీఈఓ నవీన్, రైతులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ధైర్యంగా ఉండాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంత్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎదుల్లాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయంలో ప్రత్యేక పూజలు**


అమ్మవారిని దర్శించుకుంటున్న రాజేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ఇండియా బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, రాష్ట్ర న్యాయవాదుల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి గురువారం రాత్రి బగలాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బగలాముఖి ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు కేవల్ కిషన్ భవన్‌లో కవి సమ్మేళనం**

మెదక్ కలెక్టరేట్: కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ మేడే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. శ్రమపై అంశాలపై కవితలు, పాటలు, వ్యాసాలు రాయవచ్చునని చెప్పారు. కళాభిమానులు, కవులు, కళాకారులు రచయితలు, వాగ్గేయ కారులు, పాటలు పాడేవారు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

◆ **భట్రాజు సంఘం యువజన అధ్యక్షుడిగా విశాల్ రాజు**

మెదక్ మున్సిపాలిటీ: భట్రాజు సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ప్రతికంటం విశాల్‌రాజు ఎన్నికయ్యారు. గురువారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రాజు, వెంకట కిషన్ రాజు మెదక్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా సరస్వతీ శశాంక్ రాజును, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వికాస్ రాజు, వినీత్ రాజు, మనిదీప్ రాజు, సరస్వతీ, సాయి కుమార్ రాజు, రాజు, సాయి రాజులను ఎన్నుకున్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి

రామాయంపేట(మెదక్): మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లిలో భారీస్థాయిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 7న ప్రజా యుద్ధనౌక గద్దర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆవిష్కరించనున్నారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ ర్యాకం శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, జాతీయ ఉపాధ్యక్షుడు బాబూరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కోఆర్డినేటర్ మల్లికార్జున్, దేవయ్య, తదితరులు పాల్గొంటారని సంఘం కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిపల్లి(నర్సాపూర్): శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొడిపల్లి మండలంలోని భుజిరంపేట, వెంకట్రావుపేట, రాజిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ శివకుమార్ గురువారం తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది, కార్మికులు విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేస్తుండడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోదారులు సహకరించాలని కోరారు.

నష్టపరిహారం ఇవ్వాలి


మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

శివ్వంపేట(నర్సాపూర్): కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం చేకూర్చింది. చేతిక వచ్చిన పంట చేజారిపోవడంతో రైతులు కంటతడి పెట్టారు. ఆరబోసేందుకు కల్లాల వద్దకు తీసుకొచ్చిన ధాన్యం ఎండ రాకపోవడంతో మొలకలు వస్తున్నాయి. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలో గురువారం కూడా వర్షం పడటంతో రోడ్లు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. రోడ్లపై ఆరబోసిన ధాన్యం వాన వరదలో కొట్టుకుపోతోంది. ప్రతీరోజు కూలీలను పెట్టి ధాన్యం ఆరబోయడం, మళ్లీ వాన పడగానే ధాన్యం తడిసి పోవడం వారం రోజులుగా నిత్య కృత్యమై పోతుందని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిగా మధురిక

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా మధురిక గురువారం బాధ్యతలను స్వీకరించారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ ద్వితీయ శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన మధురిక ప్రమోషన్‌లో భాగంగా చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బదిలీపై వచ్చారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శిని సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌కుమార్ సన్మానించారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌లో పెద్దమ్మ గుడి పునర్నిర్మాణం కోసం సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు గురువారం భూమి పూజ చేశారు. నాయకులు వెంకట్‌గౌడ్, అయిలయ్య యాదవ్, దశరథ, రవి, వెంకట్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా స్వచ్ఛభారత్ సదస్సు

సమావేశానికి ఉమ్మడి మండల ప్రజాప్రతినిధుల గైర్హాజరు

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ)పై ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఐకేపీ వీఓఏలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి కొద్ది రోజులుగా సమ్మెలో ఉన్న ఐకేపీ వీఓఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మొత్తం దూరంగా ఉన్నారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 30 పంచాయతీల సర్పంచ్‌లకు హకింపేట సర్పంచ్ విఠల్, భస్వాపూర్ సర్పంచ్ మల్లేశంగౌడ్ మినహా మిగతా 28 పంచాయతీల సర్పంచ్‌లు సమావేశానికి గైర్హాజరయ్యారు. శిక్షణా సదస్సును ప్రారంభించాల్సిన ఎంపీపీ, జెడ్పీటీసీ సైతం సమావేశానికి డుమ్మా కొట్టారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడమో సమాచార లోపమో తెలియదు కానీ ఉమ్మడి మండలంలోని ప్రజాప్రతినిధుల్లో ఇద్దరు మినహా మిగతా వారంతా శిక్షణా తరగతులకు దూరంగా ఉండడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశం పరిస్థితే ఇలా ఉంటే మిగతా వాటి పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని సమావేశానికి హాజరైన వారు చర్చించుకోవడం గమనార్హం. దీంతో మొక్కుబడిగా కొనసాగిన సమావేశంలో శిక్షకులు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులు, సిబ్బంది గైర్హాజరుతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కేసీఆర్‌తోనే రైతులకు న్యాయం


మాట్లాడుతున్న ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్‌తోనే రైతులకు న్యాయం జరుగుతుందని నర్సాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం నర్సాపూర్ ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్‌తో కలిసి నర్సాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తడిసిన, ముక్కిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో రైతులలో ఆత్మ స్థైర్యం పెరిగిందని చెప్పారు. రైతులకు అందుబాటులో ఉండేలా నాలుగైదు గ్రామాలకు ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజు యాదవ్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): జేపీఎస్ ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని జిల్లా జేపీఎస్‌ల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గురువారం జిల్లా జేపీఎస్‌ల సంఘం మనోహరాబాద్ మండల కేంద్రంలో ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలిపారు. వీరిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్లేశ్, నాగభూషణం, భగవాన్‌రెడ్డి, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్, ఉప సర్పంచ్ ధర్మేందర్, నాయకులు చంద్రశేఖర్, భిక్షపతి, ఇర్ఫాన్, మల్లేశ్, ఆంజనేయులు, అయిలయ్య యాదవ్, కిష్టారెడ్డి, జిల్లా జేపీఎస్ సంఘం సభ్యులు ఉన్నారు. అంతకు ముందు ప్రతాప్‌రెడ్డి దండుపల్లిలో యువకులు భాస్కర్, నాగేశ్, రమేశ్, నర్సింలు ఏర్పాటు చేసుకున్న సిమెంట్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.


వంటేరు ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జిల్లా జేపీఎస్‌ల సంఘం

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతీ

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్(బీ) గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం, ఎల్లమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు గోపాల్‌శర్మ పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలకు మాధవానంద సరస్వతీ స్వామి పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజ శ్యాంసుందర్‌రావు, ఎంపీటీసీ సత్తయ్య, యాదాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఐకేపీ వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని 18 రోజులుగా సమ్మె చేపట్టారు. అందులో భాగంగా గురువారం జిల్లా వీఓఏల సంఘం సభ్యులు మండల కేంద్రంలోని జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా కృషి చేయాలని కోరారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మనోహరాబాద్‌లో రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరూ ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐకేపీ వీఓఏల సంఘం అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూప, కోశాధికారి కవిత, తదితరులున్నారు.


జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

నల్లపోచమ్మను దర్శించుకున్న సునీతారెడ్డి


అమ్మవారికి పూజలు చేస్తున్న సునీతారెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సునీతారెడ్డి ఆలయానికి రావడంతో ఆలయ అర్చకుడు శివప్ప, ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం సునీతారెడ్డి అమ్మవారికి కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాగ్సాన్‌పల్లి సర్పచ్ ఎల్లం, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడ్ గ్రామంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ ఉదయ వేమారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కపాకర్‌రెడ్డి, గ్రామ గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లి బతుకమ్మతండాలో జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మొదటి రోజు ముంగి దేవగిరి మహారాజ్ పూజారి ఆధ్వర్యంలో జగదాంబ, సేవాలాల్ దేవతామూర్తుల విగ్రహాలను జలాధివాసం, ధన్యాదివాసం నిర్వహించారు. తండావాసులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.


కొల్చారం(నర్సాపూర్): పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి